



# తను - అతను

వెల్చేటి సుబ్రహ్మణ్యం

[ఏడువారాల నగలపేటిక ఇంతటితో సమాప్తం]

చెబితే మీరు నమ్మరు కాని, 'అతను' కోసం నే నెన్ని పాట్లు పడ్డానో ఆ దేవుడి కెరుక.

"ఎందు కంత పిచ్చి?" అని మీ రడగొచ్చు. కాని ఒక్కొక్కరి పట్ల ఒక్కొక్కరికి గల మోహం, అనుబంధం అలవి కానివీ, అంతు పట్టనివీని అని మీ రంగీకరిస్తా రనుకుంటా. అదిగో - సరిగ్గా అలాంటిదే 'అతను' పట్ల నా ప్రేమ, లేదా పిచ్చి - కాకపోతే పిచ్చి ప్రేమ. అతని కా విషయం తెలియంది కాదు. నేనే కాదు- అత న్నొకసారి చూస్తే మీరైనా అంతే.

నాకు చిన్నతనం నుంచి అమ్మతో హరికథలకు వెళ్లే అలవా టుండేది. అక్కడే 'అతను' గురించి విన్నాను. అప్పటి నుంచి నా మనసంతా అతనే నిండిపోయాడు. ఒకరోజు హరికథలో వళ్లెం పట్టే మాధవయ్య నన్ను దగ్గరకు పిలిచి, "నిన్ను రోజూ గమనిస్తూనే ఉన్నాను. 'అతను' కోసమే నీ విక్కడకు వస్తున్నావు కదూ!" అన్నాడు.

గతుక్కు మన్నాను నేను.

మరొకరు అడిగితే ఏం సమాధానం చెబుదునో గాని, మాధవయ్య అడిగాడాయె.

మాధవయ్య సత్తెకాలపు మనిషి. ఊళ్లో ఎవరి కే కష్టం వచ్చినా తను ముం దుంటాడు. చేతనయినంతలో పదిమందికీ సాయపడటం తప్ప ఎవరి నుంచీ ఏమీ ఆశించడు. హరికథకు వచ్చినా, మధ్యలో పిల్లలు ఏడిస్తే కథకు భంగం కలగకుండా పైకి తీసుకెళ్లి మరిపించడమో, కథ వినే వాళ్లకి దాహానికి నీళ్లందివ్వడమో, లేకపోతే హరిదాసుకు వళ్లెం పట్టడంతోనో గడిచిపోయేది కానీ కథ వినడం తక్కువ. అలాంటి మాధవయ్య అడిగేసరికి అబద్ధం చెప్పలేక "అతను కోసమే వస్తున్నా" నని బిడియపడుతూ చెప్పేశాను.

"ఎన్నాళ్ల నుంచి ఈ వ్యవహారం?" అన్నాడు మాధవయ్య.

ఇక దాచి లాభంలేదు. "చాలా రోజుల నుంచి" అన్నాను.

"ఎందు కింత చిన్నతనం నుంచి అటువంటివి?" అన్నాడు మాధవయ్య.

"లేదు, మాధవయ్యా! అలా ఆలోచించే స్థితి నే నెప్పుడో దాటిపోయాను. 'అతను' గురించి ఎంతగా తపన పడుతున్నావో మాటల్లో చెప్పలేను.

"విచ్చుకునే వేకువ చూస్తే అతని నవ్వు గుర్తుకొస్తుంది. వెన్నెలలో కూర్చుంటే, అతని చల్లని చూపు ఒలికితే ఇ దెంత హాయిలే అనిపిస్తుంది. ఏటి తరగలో, తేటి పలుకులో, జేగంట మోతలో, పులుగు కూతలో, పచ్చని పొలాల్లో, పచ్చిక బయళ్లలో, వీచే గాలుల్లో, వినీలాకాశంలో, పసిపాప నవ్వులో, విరిసే పువ్వులో అతని స్వచ్ఛత, ప్రేమ, ఆర్ద్రత గోచరించి నన్ను మరింత మోహానికి గురి చేస్తున్నాయి. 'అతను' కోసం, అతని స్పర్శ కోసం, అతని చూపుల కొనవెరి వెన్నెలలలో కరగటంకోసం, అతని పదములకడ నీరాజనమై నన్ను నేను అర్పించుకోవా లని నా మనసు పడే ఆరాటం, తపన, ఎన్ని జన్మల అనుబంధమో అనిపించే ఈ తాళలేని ఎడబాటు, ఈ చిన్ని బతుకున మోయలేకపోతున్నాను" అంటూ తండ్రి వంటి మాధవయ్యకు దాపరికం లేకుండా చెప్పేశాను.

"అతను కోసం నీ విక్కడకు రా నవసరం లేదు" అన్నాడు మాధవయ్య.

చెంప ఛెళ్లు మన్నట్లయి, "మరి మార్గాంతరం?" అన్నాను వచ్చే ఏడుపు నాపుకుంటూ.

"ఛ! ఛ! అలా కన్నీళ్లు పెట్టకూడదు. మీ నాయన చదివే గ్రంథాలలో

దేనిలోనో అతను చిరునామా దాచిన గుర్తు. పోయి వెతుకు" అన్నాడు మాధవయ్యా.

ఆ రోజు నుంచి మా నాన్నగారు నిత్యం పారాయాణ చేసే భగవద్గీత మొదలుకుని, మా ఇంట్లో బీరువాల నిండా వడి ఉన్న తాళ పత్ర గ్రంథాలన్నింటినీ చాలా రోజులు దీక్షతో తిరగేశాను. కాని 'అతను' చిరునామా దొరకలేదు.

ఒకనాడు గోధూళి వేళ పెరట్లో బాదం చెట్టు కింద కూర్చుని మామూలుగానే దీక్షగా ఓ గ్రంథాన్ని తిరగేస్తున్నాను.

కర్రావు లేత పాలు పితుకుతున్న అప్పన్న " మీ రతని పత్తా కోసమే ఇయ్యన్నీ తిరగేస్తున్నారట గదా! మాధవయ్య చెప్పాడు" అన్నాడు.

నిర్ఘాంతపోయాను.

"నీ పనేదో నువ్వు చూసుకోక, అ దంతా నీ కెందుకురా!" అన్నాను.

"నా కెందుకు నెండి! మీరు పెద్దోరు. మీ బోటోళ్లకి సెప్పేవోడ్ని కాదు గాని అతను కొండ మీద గుడి కాడ ఉంటా డని నాన్నగోరు ఓ పాలి నాతో అన్నారండి" అన్నాడు అప్పన్న.

ఇంతలో అమ్మ పిలిస్తే లోపలికి వెళ్లిపోయాను.

ఆ రాత్రంతా నిద్ర లేదు. ఎప్పుడూ వచ్చే పోయే భక్తులతో రద్దీగా ఉండే కొండ మీద గుడిలో అతన్ని కలుసుకోగలనా అని అనుమానం వేసింది.

ఒక్కటే ఆలోచన - అతన్ని కలుసుకోవాలి, అతని చూపులో కరిగిపోవాలి, అతని స్పర్శలో పులకించిపోవాలి.

ఒకటే తపన.

తెల్లవారుఝామునే లేచి, తలారా నీళ్లు పోసుకుని కొండ మీద దేవళానికి పోయాను. ఆ రోజు నుంచి ఉదయం సాయంత్రం అనునిత్యం నిష్ఠగా 'అతను' కోసం, అతన్ని ఆకర్షించి ప్రసన్నం చేసుకోవడం కోసం గుడి కెళ్లడం నిత్యకృత్య మైపోయింది. చాలా రోజులు గడచిపోయాయి. కాని అతణ్ణి కలవలేకపోయాను.

ఒకరోజు కార్తీక మాసపు సంధ్య వేళ మామూలుగానే దేవళానికి వెళ్లిన నేను ఆకాశ దీపం పెట్టి, ధ్వజస్తంభపు దీప కళికల మిలమిల చూస్తూ, గూటికి చేరిన పావురాల కువకువలు వింటూ చాలాసేపు ఉండిపోయాను. పూజారి హారతి వెలిగించి మంగళం పాడుతూ గంట వాయిస్తే ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చాను. గుడి కట్టేసే వేళయింది. గబగబా ఇంటికి బయలుదేరాను. గుడి మెట్ల మీద కుంటి అచ్చయ్య తప్ప మిగతా బిచ్చగాళ్లు కూడా వెళ్లిపోయారు. రోజూ ప్రసాదం వాళ్లకు పంచిపెడుతూ రావటం నాకు రివాజు. కొబ్బరి చిప్పలు అచ్చయ్య చేతిలో పెట్టి మెట్లు దిగుతున్నాను. నా వెనకాలే చంకలో కర్రతో టక్కు టక్కు మని అచ్చయ్య కూడా దిగుతూ కర్ర జారిపోవడం వలన తూలిపోతే చటుక్కున పట్టుకుని నా భుజం మీద చెయ్యి ఆన్చి నెమ్మదిగా నడిపించి కిందకి దిగాక కర్ర తీసి అందించాను.

"అమ్మ బాబోయ్! తమను న న్నంటుకున్నారు. ఈ ఇసయం వోరికీ సెప్పబోకండి. నా ఆబోరు దక్కదు" అన్నాడు.

"పరవాలేదు ఇంటి కెళ్లి స్నానం చేస్తానులే" అన్నాను.

చిన్నగా నవ్వాడు అచ్చయ్య.

ఎందుకు నవ్వాడో అర్థం కాలేదు.

"మీ రతను కోసమేగా ఈడ కొస్తున్నారు?" అన్నాడు అచ్చయ్య.

అవాక్కయిపోయాను.

"అతను ఈడకి రావడం మానేశాడు" అన్నాడు.

"ఏం?" అన్నాను అప్రయత్నంగా.


"దైవ దరిసినానికి రుసుం పెట్టి పెసాదాలు అమ్మటం మొదలెట్టిన కాడ్నించి రావటం మానేశాడు" అన్నాడు.

"ఎక్క డున్నాడు?" అన్నాను.

"అదిగో - ఆ అడవిలో కెళ్లిపోవడం చూశాను" అన్నాడు.

ఇంతలో పూజారి గుడి కట్టేసి రావడంతో అచ్చయ్యతో మాటలు చాలించి పూజారితో కలిసి వచ్చేశాను.

ఇప్పటికే నా గురించీ, 'అతను' కోసం నే పడే పాట్లు గురించీ ఊరంతా గుసగుసలుగా చెప్పుకుంటున్నారు. ఈ వ్యవహారం ఇలా కొనసాగడం నా కిష్టం లేదు. మా ఊరిని ఆనుకుని అడవి ఉంది. ఎలాగైనా అడవంతా గాలించి అయినా అతణ్ణి కలుసుకోవా లనుకున్నాను. ఏం చేస్తాను? 'అతను' పట్ల నా మోహం అటువంటిది మరి. ఆ విశాలారణ్యంలో ఏటిదాపుల అతని ఒడిలో




ఒదిగిపోయి, అతని స్పర్శలో కరిగిపోవా లని మొండి నిర్ణయానికి వచ్చేశాను.

మరునాటి ఉషోదయాన్నే ఎవరికీ చెప్పకుండా అడవి వైపు నడక సాగించాను. చింపిరి జుత్తుతో, పీలికలైన గౌనుతో ఎవరో అనాథ బాలిక ఎదురొచ్చింది. 'పొద్దున్నే ఈ ముదనష్టపు ఎదు రేంటా?' అనుకున్నాను. దారిలో ఊ రవతల సత్రంలో జంగం వాళ్లు, చిన్నా చితకా బిచ్చగాళ్లూ ఇంకా లేచీ లేవకుండా ఉన్నారు. కార్తీక మాసపు చలికే గజగజలాడిపోతూ చెట్టు కింద పడుకున్న ఓ ముసలాణ్ణి చూసి జాలేసి నేను పైన కప్పుకున్న శాలువా అతనికి కప్పి అడవిలోకి వెళ్లిపోయాను.

'అతను' కోసం ఆ రోజు అడ వంతా తెగ తిరిగాను. వెదికి వెదికి సొమ్మసిల్లిపోయే స్థితికి వచ్చాను. బారెడు పొద్దుండగానే ఆకాశం మేఘావృతమై చీకటి పడినట్లయింది. దాంతో ఇంటి త్రోవ తప్పాను. హోరని ఒకటే జడివాన. దానికి తోడు భయంకరమైన పిడుగులు, మెరుపులు. నా కింత అంత భయం కాదు. ప్రాణం పోతుం దనుకున్నాను.

ఇంతలో ఎవరో కట్టెలు కొట్టే ముసలాడు అలా పోతూ, "అడవికి కొత్తలాగుంది. నాలు గడుగులలో పాడు పడిన గుడి ఉంది. అక్కడ ఉందాం రండి!" అని తీసుకెళ్లాడు. మండపంలో మధ్యగా కూర్చున్నాం.

"అడవి కెందు కొచ్చారు- 'అతను' కోసమేనా?"

నాకు నోట మాట పెగల్లేదు.

"అతను కోసం అడవుల్లో వెదికి లాభం లేదు" అన్నాడు.

'అతను' కోసం నే పడ్డ పాట్లన్నీ చెప్పాను.

"అతను అడవుల్లోనో, గుడి దగ్గరో, గ్రంథాలలో, పురాణాలలో ఉండడు" అన్నాడు.

"మరీ?" అన్నాను అప్రయత్నంగా.

ఇంతలో ఓ మెరుపు మెరిసింది. అంతే! కళ్లు చెదిరిపోయే ఆ మెరుపులో 'అతను' చిరు నగవు వెలుగు వెల్లువలో క్షణ మాత్రాన ఎన్ని రూపాలు! కట్టెలు కొట్టేవాడు, చెట్టు కింద వణికిన ముసలాడు, ఎదురొచ్చిన చింపిరి జుత్తు పిల్ల, 'ఇప్పు డర్థమైందా?' అంటున్నట్లు చిన్నగా నవ్వుతున్న కుంటి అచ్చయ్య, తన పని తాను చేసుకుపోయే పాలేరు అప్పన్న, నత్తె కాలవు మాధవయ్య, నేను కూడా 'అతను'లోనే, 'అతను'లోనే అందరూ. అందరిలోనూ 'అతను'!

★